

గిరిజనులకు ప్రభుత్వ పథకాలు

అర్హత గల ప్రతీ గిరిజనుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు.

8లో



.. విజయం సాధించారు

జిల్లాకు చెందిన పలువురు యువతీ యువకులు అహర్నిశలూ శ్రమించి పోలీస్ శాఖలో ఎస్సైలుగా ఉద్యోగం సాధించారు.

8లో

గరిష్టం / కనిష్టం
32° / 26°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతకు రశీదు అందచేస్తున్న ఆలయ పర్యవేక్షకుడు రాంరెడ్డి

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భక్తులు విరాళం అందచేశారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన బృందావనం వెంకటాచార్యులు రూ.1,31,000ను ఆలయ అధికారులకు అందచేయగా వారు దాతకు రశీదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు రాంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, ఏపీలోని నంద్యాలకు సంజీవ్‌నగర్ భక్తాంజనేయ భజన మండలి ఆధ్వర్యాన రాసిన రామకోటిని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయయంలో సమర్పించారు. ఊరేగింపుగా వచ్చిన భక్తులు రామకోటితో ప్రదక్షిణ చేశాక మూలమూర్తుల పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా సంజీవ్‌నగర్‌కు చెందిన కోదండరామాలయ ప్రధాన అర్చకులు ప్రహ్లాద మాట్లాడుతూ 500 కోట్ల నామావళిని స్వామి వారికి సమర్పించినట్లు తెలిపారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించాలి

డీఏఎంఓ నాగరాజశేఖర్



మాట్లాడుతున్న నాగరాజశేఖర్

మణుగూరు రూరల్ : విద్యార్థుల్లో మౌలిక భాష, గణిత సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగ రాజశేఖర్ అన్నారు. మణుగూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న తొలిమెట్టు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇస్తున్న వర్క్‌షీట్లు, పాఠ్యపుస్తకాలను, ఉపాధ్యాయ కరదీపికలను అనుసంధానం చేసి సమర్థవంతంగా బోధన చేయాలని సూచించారు. పాఠ్యపుస్తకాల్లోని అంశాలను విద్యార్థులు సులభంగా నేర్చుకునేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ, కోర్స్ డైరెక్టర్ వీరస్వామి, రాష్ట్ర రీసోర్స్ పర్సన్లు వి.కోటేశ్వరరావు, వి.రవికుమార్, మండల రిసోర్స్ పర్సన్లు ఎన్. రాంబాబు, బి. శేఖర్, పాఠశాల హెచ్‌ఎం పటేల్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఎస్పీ




కొత్తగూడెంటౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నేడు (మంగళవారం) డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ డాక్టర్ వినీత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ నెల ఒకటో తేదీన చేపడతామని, అయితే ఈనెల ఒకటో తేదీన అనివార్య కారణాలతో నిర్వహించలేక పోయామని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు తమ సమస్యలను ఫోన్ ద్వారా తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు.

బూడిదలో కాసుల వేట

బీటీపీఎస్ నుంచి టన్నుల కొద్దీ వెలువడుతున్న యాష్

- సిమెంట్, పారిశ్రామిక అవసరాలకు అమ్మకం
- విక్రయానికి ప్రత్యేక కాంట్రాక్టర్ల వ్యవస్థ
- అడ్డగోలు ధరలకు అమ్ముతున్న వైనం



బీటీపీఎస్ నుంచి బూడిద తరలిస్తున్న ట్యాంకర్లు (ఇన్‌సెట్) యాష్‌పాండ్ సైలో

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఏదైనా మంచి విషయం సత్ఫలితాలు ఇవ్వడంలో విఫలమైతే బూడిదలో పోసిన పన్నీరు అనే సామెతను ఉపయోగిస్తాం. కానీ అలాంటి బూడిద నుంచి సైతం కాసులు దండుకునే విద్య తెలిసిన వాళ్లు జిల్లాలో ఉన్నారు. వాళ్ల జాడ తెలియాలంటే భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు వెళ్లాల్సిందే..

భారీగా బూడిద

దేశమంతటా థర్మల్ పవర్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో సూపర్ క్రిటికల్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. అయితే టీఎస్ జెన్‌కో మాత్రం నడుస్తున్న ట్రెండ్‌కు విరుద్ధంగా పాత కాలం నాటి సబ్ క్రిటికల్ టెక్నాలజీని ఉపయోగిస్తూ భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టింది. ఈ టెక్నాలజీ వాడటం వెనుక కారణాలు ఏమైనా.. దీంతో ప్లాంట్ నుంచి బూడిద అధికంగా విడుదలవుతోంది. ఇలా వచ్చిన బూడిదకు నీటిని కలిపి కొంత భాగం యాష్ పాండ్‌కు తరలిస్తే మరికొంత బూడిదను సిమెంట్, ఇతర పారిశ్రామిక అవసరాలకు తరలిస్తున్నారు. నిత్యం టన్నుల కొద్దీ వెలువడుతున్న బూడిదను వదిలించుకోవడం బీటీపీఎస్‌కు అనివార్యం. అయితే ఉచితంగా బూడిదను పరిశ్రమలకు ఇవ్వకుండా నామమాత్రపు ధరకే థర్మల్ పవర్ ప్లాంట్‌లు అందిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఈ విధానం అమల్లో ఉంది.

లారీకి రూ.400 అదనం

ఎలాంటి లెక్కాపత్రం లేకుండా యాష్ కోసం వచ్చిన లారీల నుంచి డబ్బులు కాజేస్తున్నారు. బూడిద కొనుగోలుకు సంబంధించిన రసీదు ఇవ్వడం, లోడ్ చేసిన బూడిదకు తగ్గ వే బిల్లులు ఇవ్వడం వంటి పనుల్లో కాంట్రాక్టర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రాసెసింగ్ ఫీజు పేరుతో రూ. 200 వసూలు చేస్తున్నారు. ఆ తర్వాత వే బిల్లులు జారీ చేసే దగ్గర రూ.100, ప్లాంటు గేటు దగ్గర ఇన్, ఔట్‌లకు కలిపి రూ.100 వంతున లారీల దగ్గర నుంచి డబ్బులు లాగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ప్లాంట్ నుంచి నిత్యం 100కు పైగా లారీల్లో యాష్ బయటకు వెళ్తుంది. అంటే ఒక్కో లారీ నుంచి రూ.400 చొప్పున రోజుకు రూ. 40,000 ఎలాంటి లెక్కాపత్రం లేకుండా జేబులో వేసుకుంటున్నారు. ఇలా నెలకు రూ.12 లక్షల వరకు యాష్ నుంచే కాసుల వర్షం కురిపిస్తున్నారు. ఈ దందా నిత్యం జరుగుతున్నా అధికారులెవరూ ఇదేంటని ప్రశ్నించరు. అధికారుల అండదండలను ఆసరాగా చేసుకుని కాంట్రాక్టర్లు మరింతగా రెచ్చిపోతున్నారు. టన్ను బూడిద ధర రూ.109 ఉండగా వీళ్లు రూ.150 వరకు కూడా అమ్ముతున్నారు.

ఇదేం దోపిడీ..?

గతంలో పాల్వంచలోని కేటీపీఎస్ కేంద్రంగా బూడిద దందాలో ఖజానా నింపుకున్న కాంట్రాక్టర్లలో కొందరు ఇప్పుడు బీటీపీఎస్‌పై కన్నేశారు. బీటీపీఎస్‌లో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ప్లాంట్ ప్రతిష్టకు మచ్చ కలుగుతోంది. దశాబ్దాల తరబడి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న ప్లాంట్లలో సైతం లేని అవినీతి ఇటీవలే ప్రారంభమైన ప్లాంట్‌లో ఉండడం ఏంటని పారిశ్రామిక వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. ఇంత అవినీతి జరుగుతున్నా ఇక్కడి అధికారులు, జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. బూడిద దందాపై వివరణ కోరేందుకు బీటీపీఎస్ డీఈకి ఫోన్ చేయగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

చెప్పిందే ధర..

బీటీపీఎస్ ఆరంభంలో టన్ను బూడిద రూ.69 చొప్పున సిమెంట్, ఇటుక పరిశ్రమలకు అమ్మేవారు. ఇటీవల ఈ ధరను రూ.109కి పెంచారు. ప్రత్యేకమైన కంటైనర్లు కలిగిన లారీల్లో బూడిదను తరలిస్తారు. సగటున ఈ ట్యాంకర్ల కెపాసిటీ 25 టన్నుల వరకు ఉంటుంది. అంటే ఒక్కో యాష్ కంటైనర్ లారీలో బూడిదను నింపుకునేందుకు రూ.2,725 నామమాత్రపు ఫీజు చెల్లిస్తే 25 టన్నుల బూడిద తీసుకెళ్లొచ్చు. అయితే సిమెంట్ కంపెనీలు లేదా లారీ కంటైనర్ల ఓనర్లు బూడిద కోసం ప్లాంట్‌కు చెల్లిస్తున్న ధర పెద్దగా లెక్కలోకి తీసుకోరు. అంతకంటే వాళ్లకు ప్రధానమైనది లోడింగ్, అన్ లోడింగ్. ఈ పనిలో ఆలస్యం జరిగితే విలువైన సమయం వృథా అవుతుంది. కంటైనర్లకు వచ్చే కిరాయి, డ్రైవర్ ఖర్చులు, క్లీనర్ బేటాలు అదనంగా చెల్లించాల్సి వస్తుంది. దీన్ని ఆసరాగా తీసుకుని బూడిద అమ్మకాల్లో కొత్త దందాకు తెరలేపారు.

వనమాకు ఊరట..



కొత్తగూడెంలో డప్పు వాయిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సీతాలక్ష్మి, హాజరైన పార్టీ శ్రేణులు

- ఎన్నిక చెల్లదన్న హై కోర్టు తీర్పుపై 'సుప్రీం' స్టే
- కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు సూచన
- ఇందుకు రెండు వారాల గడువిచ్చిన ధర్మాసనం
- నాలుగు వారాల తర్వాత ఈ కేసుపై తదుపరి విచారణ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావుకు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం స్థానం నుంచి వనమా ఎన్నిక చెల్లదంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును నిలుపుదల చేస్తూ సుప్రీం ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. నాలుగు వారాల తర్వాత ఈ కేసును విచారణకు స్వీకరించి తుది తీర్పు వెలువరిస్తామని పేర్కొంది.

తెలంగాణ అసెంబ్లీకి 2018లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కొత్తగూడెం ఎమ్మెల్యేగా గెలుపొందిన తన ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ వనమా వెంకటేశ్వరరావు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్‌దత్తాలతో కూడిన బెంచ్ ముందుకు వనమా పిటిషన్ రాగా, ప్రాథమిక విచారణ అనంతరం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు ధర్మాసనం స్టే విధించింది. రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశాలు జారీ చేసింది. నాలుగు వారాల అనంతరం ఈ కేసును విచారిస్తామని పేర్కొంది. దీంతో మరో నాలుగు వారాల పాటు హైకోర్టు ఇచ్చిన తీర్పు అమల్లోకి రాదు.

2019లో హైకోర్టుకు జలగం..

2018లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కొత్తగూడెం అసెంబ్లీ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు పోటీ చేశారు. ఆయనకు ప్రత్యర్థిగా మాజీమంత్రి వనమా వెంకటేశ్వరరావు కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఇరువురి మధ్యా గెలుపు దోబూచులాడింది. చివరకు వెంకట్రావుపై వనమా వెంకటేశ్వరావు 4,139 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఎన్నికల హడావుడి ముగిసిన తర్వాత వనమా గెలుపును సవాల్ చేస్తూ 2019లో హైకోర్టులో జలగం కేసు దాఖలు చేశారు. నామినేషన్ సందర్భంగా ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో వనమా తప్పుడు వివరాలు నమోదు చేశారంటూ అభ్యంతరం వ్యక్తం చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

తీర్పుపై స్టే

గత నాలుగేళ్లుగా ఈ కేసు హై కోర్టులో విచారణలో ఉండగా గత జూలై 25న తీర్పు వెలువరించింది. అఫిడవిట్‌లో తప్పుడు వివరాలు సమర్పించినందున వనమా ఎన్నిక చెల్లదని పేర్కొంది. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన 2018 డిసెంబర్ 12 నుంచి జలగం వెంకట్రావునే ఎమ్మెల్యేగా పరిగణిస్తున్నట్టు న్యాయస్థానం తన తీర్పులో తెలిపింది. తప్పుడు సమాచారం ఇచ్చినందుకు గాను వనమాకు రూ.5 లక్షల జరిమానా కూడా విధించింది. అయితే ఇప్పుడు ఈ తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇచ్చింది.

వనమా వర్గీయుల సంబరాలు

హై కోర్టు తీర్పుపై స్టే వచ్చిన నేపథ్యంలో కొత్తగూడెం, పాల్వంచలో వనమా వర్గీయులు సంబరాలు చేసుకున్నారు. వనమా నివాసం అభిమానులతో కిటకిటలాడింది. కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో వనమా వర్గీయులు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని, నృత్యాలు చేస్తూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు సుప్రీం కోర్టులో కౌంటర్ దాఖలు చేసేందుకు జలగం వెంకట్రావు సమాయత్తం అవుతున్నట్టు సమాచారం.

న్యాయం గెలిచింది



ప్రజాస్వామ్యం, న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంది. కొత్తగూడెం ప్రజలతో నాది 40 ఏళ్ల అనుబంధం. ఈ నియోజకవర్గ అభివృద్ధికి అహోరాత్రులు కృషి చేశా. ఇక్కడి ప్రజల నుంచి నన్ను దూరం చేసే శక్తి ఏ మగాడికీ లేదు. ఒక బీసీగా రాజకీయాల్లో ఉన్న నాపై ఎన్నో కుట్రలు జరిగాయి. కష్టం వచ్చిన ప్రతీసారి నియోజకవర్గ ప్రజలు నాకు అండగా నిలిచారు. తుదిశ్వాస వరకు కొత్తగూడెం ప్రజల సేవలోనే ఉంటాను. **– వనమా వెంకటేశ్వరరావు**

బీఆర్‌ఎస్ నేతల సంబురాలు..

సూపర్‌బజార్(కొత్తగూడెం)/పాల్వంచ : సుప్రీం కోర్టులో వనమా వెంకటేశ్వరరావుకు స్టే వచ్చిన సందర్భంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కొత్తగూడెం, పాల్వంచలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ర్యాలీ అనంతరం బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఎంపీపీలు బాదావత్ శాంతి, భూక్యా సోనా, సర్పంచ్‌లు భూక్యా పద్మ, చంటి, చంద్రశేఖర్, తాటి పద్మ, మోతి, ఉపసర్పంచ్ లగడపాటి రమేష్, నాయకులు మంతపురి రాజుగౌడ్, నాయకులు ఎస్‌వీఆర్‌కే.ఆచార్యులు, మహిపతి రామలింగం, మేదరమెట్ల శ్రీనివాసరావు, మల్లెల శ్రీరామ్మూర్తి, కొత్వాల సత్యనారాయణ, ముత్యాల ప్రవీణ్, నిమ్మకాయల సాంబశివరావు, కరుణాకర్, పి నరేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి పోటెత్తారు..

సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రియాంక ఆదేశం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రియాంక, అదనపు కలెక్టర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చి వినతులు సమర్పించారు. కలెక్టర్ ప్రియాంక ఆల అదనపు కలెక్టర్లు పి.రాంబాబు, మధుసూదన్‌రాజుతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పలు సమస్యలపై ప్రజావాణిలో అందించే వినతులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదు స్వభావాన్ని బట్టి దరఖాస్తుదారులకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు.

దరఖాస్తుల్లో కొన్ని..

- కొత్తగూడెం మున్సిపాలిటీ 24వ వార్డులోని విశ్వనాథకాలనీలో 80 ఫీట్ల రోడ్డును కొంతమంది తప్పుడు డాక్యుమెంట్లు తయారు చేసి ఆక్రమించారని, గత కమిషనర్ అడ్డుకున్నారని, ప్రస్తుత కమిషనర్ ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు దరఖాస్తు చేయగా తగు చర్యల నిమిత్తం మున్సిపల్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు.
- అశ్వారావుపేట గ్రామపంచాయతీ పరిధిలోని 16 మంది తమకు ఇంటిపన్ను, విద్యుత్, నీటి పంపు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేయగా డీపీఓకు ఎండార్స్ చేశారు.
- రైల్వే అధికారులు తమ ఇళ్లు కూల్చేశారని, డబుల్‌బెడ్ రూం లేదా ఇంటిస్థలం ఇస్తామని హామీ ఇచ్చినా నేటికీ మంజూరు చేయలేదని కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని మేదరబస్తీ నివాసి కమలాబాయి దరఖాస్తు చేయగా కమిషనర్ ఎండార్స్ చేసి విచారణ నిర్వహించి నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

కలెక్టర్‌ను కలిసిన దివ్యాంగ ఉద్యోగులు

జిల్లాకు చెందిన చెవిటి, మూగ, దివ్యాంగ ఉద్యోగులు సోమవారం కలెక్టర్ ప్రియాంక ఆలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రం కూడా అందించారు. కార్యక్రమంలో దివ్యాంగ ఉద్యోగుల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎం.అఫ్రోజ్‌బేగ్, ప్రధాన కార్యదర్శి ఎండీ రహీం, కోశాధికారి టి. సాయికృష్ణ, నాయకులు ఎస్‌కే రజబ్ అలీపాషా, బి.కిరణ్, రాజేష్‌కుమార్, పి.జయరామ్, సీహెచ్ శ్రీలత, కె మహీధర్, ఎం. ఏకాంబరం, కె. రంగారావు, బి.సుమన్‌స్వరూప్, లక్ష్మణ్, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ టీకాలు వేయాలి



వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

పాల్వంచ: అర్హులైన చిన్నారులు, గర్భిణులందరికీ టీకాలు వేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పాల్వంచ ఇందిరానగర్ కాలనీ పీహెచ్‌సీలో ఆమె టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో ఈనెల 12 వరకు టీకాలు వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు పోరుబాట

- దశల వారీ ఆందోళనల్లో సెకండ్ ఏఎన్‌ఎంలు
- 16 నుంచి నిరవధిక సమ్మె
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో 280 మంది
- ప్రస్తుతం సీజనల్ వ్యాధుల సమయం..



ఆందోళన చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

కొత్తగూడెంఅర్బన్: పుట్టిన శిశువు నుంచి వృద్ధుల వరకు వారి ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తూ, ఎప్పటికప్పుడు నివేదికలను ఉన్నతాధికారులకు అందించే రెండో ఏఎన్‌ఎంలు ఆందోళన బాట పట్టారు. తమను రెగ్యులర్ చేయాలంటూ ఉద్యమిస్తున్నారు. జిల్లాలో 280 మంది సెకండ్ ఏఎన్‌ఎంలు రూ.4 వేల వేతనంతో కాంట్రాక్టు పద్ధతిన 2008 నుంచి పని చేస్తున్నారు. వీరికి ఏడాదికి 15 రోజులు మాత్రమే సెలవులు ఇస్తుండగా మిగిలిన 350 రోజులూ విధులు నిర్వహించాల్సిందే. ఇంత శ్రమ చేస్తున్నా ప్రభుత్వం తమను గుర్తించడం లేదని ఆవేదన చెందుతున్నారు. కాగా, ఇటీవల దాదాపు 1,520 ఏఎన్‌ఎం పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. కాంట్రాక్టు పద్ధతిన 180 రోజులు పనిచేస్తే వారిని రెగ్యులర్ చేసేలా జీఓ ఉందని, 15 ఏళ్లుగా ఏజెన్సీ జిల్లాలోని మారుమూల గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేయకుండా కొత్త నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదని అంటున్నారు. ఇటీవల చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టిన ఏఎన్‌ఎంలను పోలీసులు ముందస్తుగానే అరెస్టు చేశారు. దీంతో పాటు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామని చెబుతున్నారు.

కష్టకాలంలో విశేష సేవలు..

కరోనా కష్టకాలంలో ఏఎన్‌ఎంలు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఇంటింటికీ తిరుగుతూ వైద్య సేవలందించారు. గర్భిణులు, బాలింతలకు కేసీఆర్ కిట్లు, న్యూట్రీషన్ కిట్లు అందిస్తూ వారి ఆరోగ్య క్షేమాలు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. శిశువు పుట్టినా, ఎవరైనా మరణించినా ఆ వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు. ప్రతి ఏఎన్‌ఎం నెలకు 8 నుంచి 10 ఏఎన్‌సీలను(గర్భిణులను) గుర్తించాలి. లేదంటే వారికి పై అధికారులు మెమోలు జారీ చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా అనేక ఆంక్షల నడుమ పని చేస్తున్నా తమను ప్రభుత్వం ఎందుకు క్రమబద్ధీకరించడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు.

గోడు వర్ణనాతీతం..

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో హైదరాబాద్ ఏజెన్సీ ద్వారా ఔట్‌సోర్సింగ్ కింద ఏడాదిన్నర క్రితం 39 మంది ఏఎన్‌ఎంలు విధుల్లో చేరారు. వారికి నాలుగైదు నెలలకు కూడా ఒకసారి వేతనం వస్తుందో, రాదో తెలియని పరిస్థితి నెలకొంది. తమ వేతనాలు ఎవరు, ఎందుకు ఆపుతున్నారో తెలియడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నుంచి విధులు నిర్వహించే చోటుకు వెళ్లడానికి కనీసం ఆటో చార్జీలు కూడా లేక ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. తమకు నెలనెలా వేతనాలు ఇవ్వాలని, ఇందుకోసం వైద్యారోగ్య శాఖ అధికారులు కృషి చేయాలని కోరుతున్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆందోళన

సూపర్‌బజార్(కొత్తగూడెం): తమను పర్మనెంట్ చేయాలని, పరీక్షలు లేకుండా ఉద్యోగం క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ సెకండ్ ఏఎన్‌ఎంలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ.. ఎలాంటి పరీక్షలు లేకుండా వీఆర్‌ఏ, ఆర్‌టీసీ, కాంట్రాక్టు టీచర్లు, సెర్ప్ ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించినట్టుగానే 15 ఏళ్లుగా పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను కూడా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బానోత్ ప్రియాంక, ఎండీ సజ్జు బేగం, పుష్ప, బాల నాగమ్మ, వెంకటరమణ, పార్వతి, రాములమ్మ, కౌసల్య, ఇందిర, జ్యోతి పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయంపై స్పష్టత లేదు

సెకండ్ ఏఎన్‌ఎంలు రెగ్యులరైజేషన్ కోసం ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. వారు నిరవధిక సమ్మెకు దిగితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఇప్పటివరకు స్పష్టత లేదు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఏఎన్‌ఎంలకు కంటిన్యూషన్ లెటర్ ఇటీవలే వచ్చింది. వారికి వేతనాలు విడుదల చేసే ప్రక్రియ ప్రారంభమవుతుంది.

– శిరీష, డీఎంహెచ్‌ఓ

మహా వృక్షాలకు మళ్లీ ప్రాణం

నేలకొరిగిన చెట్లకు ట్రాన్స్‌లొకేషన్ చేసిన సింగరేణి అధికారులు



కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయం వద్ద పడిపోయిన వృక్షాన్ని జేసీబీ ద్వారా తీసుకెళ్తున్న సిబ్బంది (ఇన్‌సెట్) వృక్షాన్ని నాటుతున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఆరు దశాబ్దాల పురాతన మర్రి చెట్టుతో పాటు ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లోని మరో వృక్షం నెలకొరిగాయి. దీంతో ఆ రెండు చెట్లనూ సింగరేణి అధికారులు తిరిగి సోమవారం ఇల్లెందు గెస్ట్ హౌస్ ఆవరణలో నాటి (ట్రాన్స్‌లొకేషన్) వాటికి పునర్జన్మ ఇచ్చారు. ఈ సందర్భంగా సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్ బలరామ్ మాట్లాడుతూ ట్రాన్స్‌లొకేషన్ పర్యావరణ హిత చర్యలకు సింగరేణి ప్రాధాన్యం ఇస్తుందని, వృక్షాల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇటీవలి వర్షాలతో పడిపోయిన వృక్షాల స్థానంలో కొత్తవి పెరగాలంటే చాలా సంవత్సరాలు పడుతుందని, ఈ చెట్లనే కూకటివేళ్లతో పెకిలించి మరో చోట నాటి వాటి సంరక్షణకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గతంలో రామగుండం–1 ఏరియాలో కూడా ఇదే తరహాలో చేశామన్నారు.

క్లుప్తంగా

ఆర్టిజన్‌లుగా తీసుకోవాలి



వజీర్‌కు వినతి పత్రం అందిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

పాల్వంచ: ఐడీ కార్డు నంబర్‌లు కలిగిన, అర్హులైన కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిజన్‌లుగా తీసుకోవాలని తెలంగాణా స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (1535) జాతీయ అధ్యక్షుడు ఎం.ఎ.వజీర్ డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కార్మికులు వజీర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వజీర్ మాట్లాడుతూ పది సంవత్సరాలపాటు కేటీపీఎస్ ఓఅండ్ఎం, 5,6 దశల్లో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేశారని, ఐడీ నంబర్‌లు కలిగిన వారిని ఆర్టిజన్‌లుగా తీసుకోవాలని గతంలో హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా జెన్‌కో యాజమాన్యం స్పందించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించండి

ప్రజావాణిలో ఎర్రబోరువాసుల వేడుకోలు



సమస్య వివరిస్తున్న ఎర్రబోరు గ్రామస్తులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని పాల్వంచ మండలం దంతెలబోర పంచాయతీ ఎర్రబోరు గ్రామానికి చెందిన ఆదివాసీలు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో అధికారులను వేడుకున్నారు. ఓటరు కార్డులు, ఆధార్ కార్డులు, పంపులు, ఇంటినంబర్లు ఉన్నా విద్యుత్ మీటర్లను మంజూరు చేయడం లేదని వాపోయారు. దీంతో స్పందించిన అదనపు కలెక్టర్ రాంబాబు సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బొగ్గు ఉత్పత్తి పరిశీలన



ఓసీలో పరిశీలిస్తున్న అధికారులు

ఇల్లెందు: సింగరేణి డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర రెడ్డి, సేఫ్టీ డైరెక్టర్ కె.గురువయ్య సోమవారం జేకే-5 ఓసీని సందర్శించి, బొగ్గు ఉత్పత్తిని పరిశీలించారు. రవాణా, బ్లాస్టింగ్ వివరాలను ఏరియా జీఎం జాన్ ఆనంద్, ఏజెంట్ బొల్లం వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. వర్షం కారణంగా బొగ్గు ఉత్పత్తికి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పంజాల శ్రీనివాస్, మల్లారపు మల్లయ్య, పూర్ణచందర్ పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో జాతీయ ర్యాంక్




మహంత్‌ను అభినందిస్తున్న హెచ్ఎం శాలినికుమారి

కొత్తగూడెం టౌన్: ఇండియన్ టాలెంటెడ్ ఒలంపియాడ్‌లో కొత్తగూడేనికి చెందిన పండుగ ఉజ్వల్ మహంత్ జాతీయస్థాయిలో 7వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా స్థానిక శ్రీశారద విద్యాలయంలో మహంత్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాలినికుమారి మాట్లాడుతూ.. ఒలంపియాడ్ గణితశాస్త్ర పరీక్షలో ఉత్తీర్ణుడైన మహంత్ జాతీయ స్థాయి ర్యాంక్‌తో పాటు రూ.700 రివార్డు సాధించాడని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ జలగం రంగారావు ఉజ్వల్‌ను అభినందించారు. కార్యక్రమంలో శ్రీశారద విద్యాలయ సిబ్బంది బాబర్ అజయ్‌సింగ్, ఉబ్బాని శరత్‌చంద్ర, ఎ.రాధ పాల్గొన్నారు.

డీసీసీబీ సీఈఓ పోస్టుకు నోటిఫికేషన్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈఓ) పోస్టుకు తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు(టస్కాబ్) నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుత సీఈఓ వీరబాబు పదవీకాలం రానున్న అక్టోబర్‌తో మూడేళ్లు పూర్తవుతుంది. ఆలోగా మరొకరిని నియమించేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. అనుభవం కలిగిన జనరల్ మేనేజర్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లతో పాటు ఉద్యోగ విరమణ చేసి అర్హులైన అధికారులు కూడా ఈనెల 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం ఇంటర్వ్యూ ఆధారంగా సీఈఓగా నియమిస్తారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,091



శ్రమించారు.. విజయం సాధించారు

ఎస్‌ఐలుగా ఎంపికైన జిల్లావాసులు



దివ్యాగౌడ్

కొత్తగూడెంటౌన్/ఇల్లెందురూరల్/దమ్మపేట/ ములకలపల్లి: ఎస్‌ఐలుగా ఉద్యోగం సాధించాలని పలువురు యువతీయువకులు కలలుగన్నారు. అహర్నిశలు శ్రమించి విజయం సాధించారు. పేదరికం, సౌకర్యాల లేమి తదితర ఆటంకాలను ఎదుర్కొని విజయతీరాలకు చేరారు. రెండేళ్లపాటు విరామం లేకుండా సన్నద్ధమై ఎస్‌ఐగా ఎంపికైంది కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ ప్రాంతానికి చెందిన ఓ యువతి. వీరగోని ఎల్లాగౌడ్-శ్రీలత దంపతుల కుమార్తె దివ్యాగౌడ్ సివిల్ ఎస్సైగా ఉద్యోగం సాధించింది. తండ్రి వాటర్ ప్లాంట్ వ్యాపారి, తల్లి గృహిణి కాగా అన్న మనోజ్ అమెరికాలో ఎంఎస్ చదువుతున్నారు. బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన దివ్య హైదరాబాద్‌లో గ్రూప్‌లో పరీక్షలకు 6 నెలలపాటు కోచింగ్ తీసుకుంది. ఎస్‌ఐ నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేసింది. గతంలో తీసుకున్న కోచింగ్ మెటీరియల్, దినపత్రికలను చదువుతూ పరీక్షకు సన్నద్ధమైంది. రెండు రోజుల క్రితం వెల్లడైన ఫలితాల్లో ఎస్‌ఐగా ఎంపికై ంది. తల్లిదండ్రులు, సోదరుడి ప్రోత్సాహంతోనే సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం సాధించినట్లు దివ్య తెలిపింది.



బాలకృష్ణ, నవితలను సత్కరిస్తున్న ములకలపల్లి ఎస్సై సాయికిషోర్‌రెడ్డి

ఉపాధ్యాయుడి బిడ్డ..



గుమ్మడి హరిత

ఇల్లెందు మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీకి చెందిన ఐటీడీఏ ఉపాధ్యాయుడు గుమ్మడి పాపయ్య, దివంగత అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు కళావతి దంపతులకు ముగ్గురు కూతర్లు. పెద్దకుమార్తె అనూష ఎంఫార్మసీ చదవగా రెండో కుమార్తె అపర్ణ ఎంబీఏ, చిన్నకుమార్తె హరిత బీటెక్ పూర్తి చేశారు. అనూషకు వివాహం కాగా రెండో కుమార్తె అపర్ణ ఎల్ఎల్‌బీ చదువుతోంది. తండ్రి ప్రోత్సాహంతో హరిత గ్రూప్స్‌కు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలోనే ఎస్సై పరీక్ష రాసి, ఉద్యోగం సాధించింది. ఈ సందర్భంగా సర్పంచ్ వల్లాల మంగమ్మ, ఎంపీటీసీ శీలం ఉమ, ఉపసర్పంచ్ నాలవెల్లి నర్సింహారావు హర్షం వ్యక్తం చేశారు.

కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తూనే..



అశోక్‌కుమార్

దమ్మపేట మండల పరిధిలోని లచ్చాపురం గ్రామానికి చెందిన గద్దల అశోక్‌కుమార్ సివిల్ ఎస్సైగా ఎంపికయ్యాడు. పేద కుటుంబంలో జన్మించిన అశోక్ బీటెక్ పూర్తి చేశాక ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేశాడు. కరోనా కష్టకాలంలో ఉద్యోగం కోల్పోవడంతో ఉపాధి హామీ కూలీగా పనిచేస్తూ, సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం పొందాడు. కొత్తగూడెంలో విధులు నిర్వర్తిస్తూనే ఎస్సై ఉద్యోగానికి సన్నద్ధమయ్యాడు. సివిల్ ఎస్సైగా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్‌ను జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, నాయకులు దారా యుగంధర్, దారా మల్లికార్జునరావు, అంకత మహేశ్వరరావు తదితరులు అభినందించారు.

విజేతలకు సన్మానం..

ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం తురక సీతారాములు, సుజాత దంపతుల కుమారుడు బాలకృష్ణ ఫైర్ డిపార్ట్‌మెంట్‌లో ఎస్సైగా ఎంపికయ్యాడు. ఇతను 2018లో జూనియర్ పంచాయతీ సెక్రటరీ, 2020లో సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించాడు. కొత్తగూడెం ఓఎస్‌డీ కార్యాయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ ఎస్‌ఐ పరీక్షకు రాసి అగ్నిమాపక శాఖలో ఎస్సైగా కొలువు సాధించాడు. కాగా మండలంలోని సూరంపాలెం గ్రామానికి చెందిన సాయిన్ని రమణారావు, దుర్గావేణి దంపతుల కుమార్తె నవిత ఎస్‌ఐగా ఎంపికై ంది. బీటెక్ పూర్తి చేసిన ఈమె మండలం నుంచి ఎస్‌ఐగా ఎంపికైన తొలి మహిళ. విజేతలను ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో అభినందించారు. పోలీస్‌స్టేషన్లో ఎస్‌ఐ సాయికిశోర్ రెడ్డి, ఏఎస్‌ఐ తిరుమలరావు వీరిని శాలువాతో సత్కరించారు.

ఆదివాసీ హక్కులు నిర్వీర్యం

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు గోవర్దన్



మాట్లాడుతున్న గోవర్దన్

భద్రాచలంటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదివాసీ హక్కులను నిర్వీర్యం చేసే కుట్రచేస్తోందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు కె.గోవర్దన్ ఆరోపించారు. భద్రాచలం పట్టణంలోని గిరిజన అభ్యుదయ భవన్‌లో ప్రపంచ ఆదివాసీ పోరాట దినం సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆదివాసీ మహిళలను వివస్త్రగా చేసి ప్రదర్శనలు చేసే దుర్మార్గపు విధానాలను ప్రతిఘటించాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ప్రకారం గోదావరి ముంపు నుంచి భద్రాద్రికి శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. తొలుత పట్టణంలో ర్యాలీ నిర్వహించి, ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్, మానవ హక్కుల వేదిక ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దాగం ఆదినారాయణ, సున్నం భూలక్ష్మి, ఆదిలక్ష్మి, నాగేశ్వరరావు, బానోతు ఊక్లా నాయక్, పున్నం చందు, కొండలరావు, రవి, సాంబ, గణేష్, మంజుల, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

అన్యాయంగా కేసు పెట్టారు



వివరాలు వెల్లడిస్తున్న రాములు, సురేష్

టేకులపల్లి: భూ వివాదంలో తనపై అన్యాయంగా కేసు పెట్టారని మండలంలోని కోయగూడెం గ్రామానికి చెందిన మట్టపల్లి రాములు ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం టేకులపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తన కుమారుడు సురేష్‌తో కలిసి వివరాలు వెల్లడించాడు. సులానగర్‌కు చెందిన తోడేటి దావీదు అనే వ్యక్తి ఒకే భూమిని తనకు, మరో వ్యక్తి పెరుమాళ్లపల్లి నాగేశ్వరరావుకు విక్రయించాడని, ఈ వివాదంలో నాగేశ్వరరావు తనపై పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టాడని రాములు తెలిపాడు. దీంతో ఎస్‌ఐ ఇరువర్గాలను పిలిచి నాగేశ్వరరావు 13 గుంటలు, తాను 11 గుంటలు తీసుకోవాలని సూచించి, తన వద్ద ఉన్న బయానా కాగితం తీసుకున్నాడని వివరించాడు. మూడు నెలలు గడుస్తున్నా భూమి లేదా, భూమి కొన్న రూ. 5 లక్షలు ఇప్పించడం లేదని, చివరకు బయానా కాగితం కూడా ఇవ్వడం లేదని వాపోయాడు. అట్రాసిటీ కేసు పెడతానని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై టేకులపల్లి ఎస్‌ఐ గన్‌రెడ్డి రమణారెడ్డి వివరణ కోరగా.. సులానగర్‌లో 24 గుంటల భూమి వివాదంలో నాగేశ్వరరావు నుంచి ఫిర్యాదు రావడంతో ఇరు వర్గాలను పిలిపించానని తెలిపారు. రెవెన్యూ శాఖ లేదా కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించానని, తనపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన మినీ ట్రక్కు

హోంగార్డు మృతి, మరో 14 మందికి గాయాలు



హోంగార్డు అప్పారావు (ఫైల్)

దమ్మపేట: మినీ ట్రక్కు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొనడంతో ఓ హోంగార్డు మృతి చెందాడు. మరో 14 మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని మందలపల్లి గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... దమ్మపేట పోలీసు స్టేషన్‌కు చెందిన హోంగార్డులు యార్లగడ్డ సుబ్బారావు, సత్తెనపల్లి అప్పారావు(43) మందలపల్లి నుంచి అశ్వారావుపేట వైపు బైక్‌పై వెళ్తున్నారు. అదే సమయంలో ఏపీలోని ఏలూరు జిల్లా టీ.నర్సాపురం మండలం బొర్రంపాలెం గ్రామానికి చెందిన 13మంది వ్యవసాయ కూలీలు ఖమ్మంజిల్లా ఏన్కూరుకు పామాయిల్ మొక్కలు నాటేందుకు మినీ ట్రక్కులో వస్తున్నారు. మందలపల్లి శివారులో లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో అతివేగంతో వెళ్తున్న మినీ ట్రక్కు అదుపుతప్పి బోల్తాపడింది. అనంతరం దొర్లుకుంటూ పోయి ఎదురుగా వస్తున్న హోంగార్డుల బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు హోంగార్డులతోపాటు ట్రక్కులో ప్రయాణిస్తున్న సత్యనారాయణ, చింతయ్య, సూరి, ధనయ్య, రాజులకు తీవ్ర గాయాలయ్యాయి. ట్రక్కులో ఉన్న మరో ఎనిమిది మంది స్వల్పంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హోంగార్డులను మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఖమ్మం తరలిస్తుండగా మార్గంమధ్యలో అప్పారావు మృతి చెందాడు. కూలీలను కూడా అంబులెన్స్‌లో దమ్మపేట నుంచి జంగారెడ్డిగూడెం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మందలపల్లి గ్రామంలో అప్పారావు మృతదేహాన్ని జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు జారె ఆదినారాయణ, వగ్గెల పూజ, ఎస్సై రవికుమార్, పోలీసు సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు. హోంగార్డ్స్ ఆర్‌ఐ సుధాకర్, సీఐ కరుణాకర్, హోంగార్డ్స్ అసోసియేషన్ బాధ్యులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

విద్యుత్ చౌర్యం కేసులో రూ.1.44లక్షల జరిమానా

ఖమ్మం లీగల్: విద్యుత్ చౌర్యం కేసులో కొణిజర్ల మండలం ఉప్పలచలకకు చెందిన బాదా వత్ కస్నాకు రూ.1,44,420 జరిమానా విధి స్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి తీర్పు చెప్పారు. సోమవారం వెలువరించిన ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. బాదావత్ కస్నా తన ఇంటికి అక్రమంగా విద్యుత్ వాడుకుంటుండగా 2020 జనవరి 28న ఖమ్మం విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో గుర్తించి కేసు నమోదు చేశారు. ఈమేరకు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా.. విచారణ అనంతరం జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొత్తా వెంకటేశ్వరరావు, గాదె హరేందర్‌రెడ్డి వాదించగా.. ఏపీటీఎస్ ఇన్‌స్పెక్టర్ జూకూరి రాజశేఖర్, హోంగార్డ్ అయూబ్ సహకరించారు.

ఇద్దరు నిందితులు అరెస్ట్

భద్రాచలంఅర్బన్: ఇటీవల భద్రాచలం పట్టణం, పరిసర ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు చోరీచేసిన ఇద్దరు నిందితులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. భద్రాచలం బస్టాండ్ వద్ద తనిఖీ చేస్తున్న క్రమంలో పట్టణానికి చెందిన మైపా నవీన్, చెంగల సాయికుమార్ పట్టుబడగా, పోలీసులు వారి నుంచి ఒక ల్యాప్ టాప్, 5 సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, సీఐ నాగరాజు రెడ్డి వివరాలు వెల్లడించారు.

కలప స్వాధీనం

ఇల్లెందురూరల్: మండలంలోని పోచారంతండా గ్రామంలో కొమరారం ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్, డీఆర్‌వో జయరాం సోమవారం తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని ధరావత్ దేవ్లా ఇంట్లో 26 టేకు కలప చెక్కలు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. కలపను స్వాధీనం చేసుకోవడంతోపాటు నిల్వ ఉంచిన దేవ్లాపై కేసు నమోదు చేశారు. నిల్వ ఉన్న కలప విలువ రూ.15వేలు ఉంటుందని అధికారులు తెలిపారు.

నిందితుడిపై కేసు నమోదు

చంద్రుగొండ : మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో ఉన్న కేసీఆర్ కాలనీలో నివాసముంటున్న చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మాచినేని రవి సోమవారం తెలిపారు. నిందితుడు సయ్యద్ లాలుపై పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, అత్యాచారయత్నం కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సెల్‌టవర్ ఎక్కిన లారీ డ్రైవర్



సెల్ టవరెక్కి దిగిన కాంతారావును పట్టుకుని ఏడుస్తున్న కుటుంబ సభ్యులు

సింగరేణి(కొత్తగూడెం): కోల్ ట్రాన్స్‌పోర్ట్‌లోని రెండు యూనియన్ల మధ్య గొడవల కారణంగా తమకు పనిలేక ఇల్లు గడవక కష్టమవుతోందంటూ ఓ లారీ డ్రైవర్ సోమవారం రుద్రంపూర్‌లోని బీఎస్ఎన్ఎల్ టవర్ ఎక్కాడు. స్థానికుల కథనం ప్రకారం.. సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ తండాకు చెందిన మేడేపల్లి కాంతారావు టవరెక్కి ఆత్మహత్యకు యత్నించాడు. కోల్ ట్రాన్స్‌పోర్ట్‌లోని రెండు యూనియన్ల మధ్య గొడవలతో పనుల్లేక కుటుంబం గడవడం లేదు. భార్యాపిల్లలకు ఒక పూట భోజనం కూడా పెట్టలేక పోతున్నాననే ఆవేదనతో టవరెక్కాడు. విషయం తెలుసుకున్న టూ టౌన్ ఎస్‌ఐ జుబేదా బేగం అక్కడికి చేరుకుని, నచ్చజెప్పగా కాంతారావు టవర్ దిగి వచ్చాడు. అనంతరం ఎస్‌ఐ అతనికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇక్కడ పని దొరకకపోతే మరో చోట పని వెతుక్కోవాలని సూచించారు. 25 కిలోల బియ్యం వితరణ చేశారు.

రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫాంపై వ్యక్తి మృతి

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫాంపై సోమవారం ఒక వ్యక్తి మృతి చెందాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం రాల్యూర్‌కు చెందిన తవాసి(39) జిల్లాలోని కూసుమంచి బేకరీషాపులో కొంతకాలంగా పనిచేస్తున్నాడు. గతంలో ఆయన ఎర్రుపాలెంలోని బేకరీ షాపులో కూడా పనిచేశాడు. కూసుమంచి నుండి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో ఎర్రుపాలెం వచ్చిన ఆయన అనారోగ్యం కారణంగా మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కాగా, తవాసీ మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ సభ్యుడు మునుగోటి నర్సింహారావు సహకారంతో మధిర ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

విద్యుత్ సర్వీస్ తొలగించారని ఆగ్రహం

విద్యుత్ ఉద్యోగులపై దాడి, ఫర్నీచర్ ధ్వంసం

రఘునాథపాలెం: ఇంటి విద్యుత్ కనెక్షన్ తొలగించడంతో ఉద్యోగులపై దాడి చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు. రఘునాథపాలెం పోలీసులు వెల్లడించిన వివరాలు... పది రోజులు క్రితం మండలంలోని హర్యాతండాలో విద్యుత్ బిల్లులు చెల్లించని వారి సర్వీసులే అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్న వారి సర్వీసులను ఉద్యోగులు తొలగించారు. దీంతో తండాకు చెందిన బి.రాము, వి.శివలాల్ సోమవారం మంచుకొండ సబ్ స్టేషన్ వద్ద సెక్షన్ కార్యాలయానికి వచ్చిన వారు తమ ఇళ్లలో కరెంట్ లేకుండా చేశారంటూ మంచుకొండ లైన్ ఇన్‌స్పెక్టర్ బాబురావుపై దాడి చేశారు. అడ్డొచ్చిన సబ్ ఇంజనీరు యాకూబ్, జేఎల్ఎం దేవీలాల్‌పై సైతం దాడి చేయడమే కాక కార్యాలయంలోని కంప్యూటర్, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కాగా, ఏడీ సంజయ్‌కుమార్ తదితరులు పరిశీలించి ఎస్ఈ సురేందర్, డీఈ రామారావు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు.

గిరిజనుల చెంతకు ప్రభుత్వ పథకాలు

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న పీఓ ప్రతీక్, అధికారులు

భద్రాచలం: అర్హులైన ప్రతీ గిరిజనుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ వెల్లడించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల గిరిజనుల నుంచి దరఖాస్తులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం వాటిని సంబంధిత యూనిట్ అధికారులకు అందచేసి అర్హతల మేరకు పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరు జీవనోపాధి పెంపొందించుకోవడానికి ప్రభుత్వ పథకాలు అందించడానికి కృషి చేస్తానని అన్నారు. పోడు భూముల సమస్యలపై అందిన దరఖాస్తులను పరిశీలిస్తామని తెలిపారు. ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఏఓ భీమ్, అధికారులు తానాజీ, విజయ్ కుమార్, సురేష్‌బాబు, ఆర్.శ్రీనివాస్, భాస్కరన్, అశోక్ కుమార్, మునీర్‌పాషా, ప్రభాకర్‌రావు, హరికృష్ణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

'ట్రైకార్' అమలులో అలసత్వం వద్దు

ట్రైకార్ పథకం అమలు, లబ్ధిదారుల ఎంపికలో అధికారులు అలసత్వం వహించొద్దని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. జిల్లాలోని ఎంపీడీఓలతో ట్రైకార్ అమలుపై ఆయన వీసీ ద్వారా సమీక్షించారు. 2021- 22 సంవత్సరానికి నిధులు మంజూరైనందున ప్రతిపాదనలు త్వరగా సమర్పించాలని తెలిపారు. అలాగే, పోడు భూములకు సంబంధించి గిరిజనులు దరఖాస్తులు ఇస్తున్నందున వివరాలు సేకరించాలని, గిరిజన గ్రామాల్లో జీఈపీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వభూములు గుర్తించాలని సూచించారు. కాగా, భద్రాచలం గిరిజన గురుకుల కళాశాలలో శిథిలావస్థలో ఉన్న వసతిగృహం కూల్చేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు పీఓ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 10వ తేదీలోగా ఐటీడీఏలోని ఈఈ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పిస్తే 11న పరిశీలించి ఖరారు చేస్తామని ఆయన వెల్లడించారు.

టీకాలు తప్పక వేయించుకోవాలి

భద్రాచలంఅర్బన్: మిషన్ ఇంద్రధనుష్‌లో భాగంగా ఐదేళ్ల లోపు పిల్లలు, గర్భిణులు తప్పక టీకాలు వేయించుకోవాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. భద్రాచలంలోని మారుతీనగర్ ఆరోగ్య ఉప కేంద్రంలో వ్యాక్సినేషన్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 12వ తేదీ వరకు జరిగే మిషన్ ఇంద్రధనష్‌లో భాగంగా పిల్లలు, గర్భిణులకు టీకాలు వేసేందుకకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రాజకుమార్, డాక్టర్ చైతన్య, సుభాష్, హెచ్ఈఓ దుర్గారావు పాల్గొన్నారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ టోర్నీలో పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులతో నిర్వాహకులు

కొత్తగూడెంటౌన్: తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో సోమవారం జరిగిన చాంపియన్ షిప్ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. ఈమేరకు క్రీడాకకారులు పతకాలు సాధించారని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మహీధర్ వెల్లడించారు. భద్రాచలానికి చెందిన టి.తేజ, పాల్వంచకు చెందిన బి.లోకేష్ బంగారు పతకాలు సాధించగా, భద్రాచలానికి చెందిన ఎస్.కే.అఫ్రీన్ రజిత పతకం, ఆళ్లపల్లికి చెందిన కె.హారిక కాంస్య పతకం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కోచ్‌లు పి.నాగేందర్, గిరిప్రసాద్, సనందకోరి, మల్లికార్జున్, అసోసియేషన్ బాధ్యులు కె.సారంగపాణి, జీవీకే.మనోహర్‌రావు, గొట్టపు రాధాకృష్ణ, రాజేంద్రప్రసాద్ తదితరులు అభినందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధం



కాలిపోతున్న లారీ

బూర్గంపాడు: మండలంలోని లక్ష్మీపురం గ్రామం వద్ద జాతీయ రహదారిపై షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... లక్ష్మీపురం నుంచి మణుగూరు వెళ్తున్న లారీ కేబిన్‌లో మంటలు చెలరేగటంతో డ్రైవర్ అప్రమత్తమయ్యాడు. లారీని రోడ్డు పక్కకు తీసుకువచ్చి నిలిపివేశాడు. క్షణాల్లోనే మంటలు లారీ మొత్తం వ్యాపించాయి. ఎస్సైలు రాజ్‌కుమార్, నాగబిక్షం ఘటనా ప్రాంతానికి వచ్చి మంటలను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో లారీ పూర్తిగా దగ్ధమైంది.